నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
3 | నల్లగొండ, శనివారం 5 అక్టోబర్ 2024 | SURYAPET



బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్కులు అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## అభివృద్ధి చేతగాకే అరాచకాలు

- కేసీఆర్, బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం
- అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారు
- సభ్యత్వ బీమాతో కార్యకర్తల కుటుంబాలకు ధీమా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్కులు అందజేత

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 4 : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు అభివృద్ధి పథంలో నడిపిందెవరో, అభివృద్ధిని అటకెక్కించి అరాచాకాలకు పాల్పడుతున్నదెవరో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సభ్యత్వం కలిగిన రెండు కుటుంబాలకు రూ.2లక్షల బీమా చెక్కులు, మరొకరికి ఎల్ఓసీ, 103 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్, బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసమన్నారు. కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన అయితే.. కాంగ్రెస్ పార్టీది కూల గొట్టే అరాచక పాలన అని తెలిపారు. ఆరు గ్యారంటీలంటే ఇల్లు ఇస్తారని ప్రజలు నమ్మి ఓటేస్తే ఉన్న ఇంటిని కూలగొడుతున్నారన్నారు. రైతు భరోసా లేదు, రైతుబంధు ఇస్తలేరని విమర్శించారు. హామీలను అమలు చేయలేక, అభివృద్ధి చేతగాక అరాచకాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజల సమస్యలు పట్టకపోగా కొత్త సమస్యలు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను కంటి రెప్పలా కాపాడుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వ భీమా కార్యకర్తల కుటుంబాలకు ఎంతో ధీమాను అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, ఆయా మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తూడి నర్సింహారావు, దొంగరి యుగంధర్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## గాయత్రీదేవిగా పర్వతవర్ధినీ అమ్మవారు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 4 : యాదగిరిగుట్ట పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండోరోజు ప్రాతఃకాల పూజ, దేవీ చతుషష్టి ఉపచార పూజ, సహస్రనామార్చనలు, మంత్ర పుష్ప నీరాజనాలు శాస్త్రోక్తంగా సాగాయి. పర్వతవర్ధినీ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



గాయత్రీదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న శివాలయ ప్రధానార్చకులు గౌరిభట్ల నరసింహరాములు శర్మ

# సన్నాలపై మరో దోఖా!



## ప్రభుత్వ మద్దతు ధర కన్నా మిల్లుల వద్దే అధిక రేటు



- తేమ శాతం 14 ఉంటేనే రూ.500 బోనస్
- ప్రస్తుతం పచ్చి వడ్లే మంచి ధరకు అమ్ముకుంటున్న రైతాంగం
- ధాన్యం ఆరబెడితే కింటాకు 7 కిలోలు లాస్
- మిల్లుల వద్ద అమ్మిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్
- సూర్యాపేట జిల్లాలో 3,79,000 ఎకరాల్లో సన్న వడ్లు సాగు

సూర్యాపేట, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : కొత్రీల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఫలితం క్షేత్రస్థాయిలో రైతులకు దక్కేలా కనిపించడం లేదు. రైతులు చేతికి వచ్చిన పంటను మిషన్లతో కోసి ఆరబెట్టకుండా పచ్చి వడ్లనే మిల్లులకు తరలిస్తుండడంతో ప్రభుత్వం పెట్టే నిబంధనలకు అనుగుణంగా బోనస్ దక్కే చాన్సే లేదు. 14శాతం తేమ ఉంటేనే ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. కోసిన వెంటనే వడ్లు తీసుకువస్తే 25 నుంచి 30 శాతం వరకు తేమ ఉంటుండడంతో కొనుగోలు చేయని పరిస్థితి. మరోవైపు సన్న రకం ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే సన్నాలకు ధర అధికంగా పలుకుతున్నది. పచ్చి వడ్లను కొనుగోలు చేసిన మిల్లులు వాటిని స్టీమ్ చేసి డ్రై చేసి స్టోర్ చేయడంతో వారికి కూడా నష్టం లేదని మిల్లర్లు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు, పంటల వివరాలు, బ్యాంక్ అకౌంట్ల సమాచారం ప్రభుత్వం వద్ద ఉన్నందున మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రం, లేదా ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తే సన్నాలు పండించిన రైతులకు బోనస్ దక్కుతుంది తప్ప కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తేనే బోనస్ ఇస్తామంటే కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడమే అవుతుందని రైతులు వాపోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ అంటూ చేసిన వాగ్దానం ద్వారా రైతులను మరోసారి మోసం చేస్తుందనే అనుమానాలు బలంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే రైతు భరోసా ఇవ్వకపోగా, రుణమాఫీ కూడా అందరికీ చేయలేదు. దీనికి తోడు సాగునీటి నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడంతో జిల్లాలో వందల ఎకరాల్లో పంట మునిగింది. వేలాది ఎకరాల్లో ఎండిపోయింది. ఇన్ని రకాలుగా నష్టపోతున్న రైతాంగానికి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ సీజన్‌లో సన్న వడ్లు పండిస్తున్న రైతులకు కింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనడం మోసమేనని స్పష్టమవుతున్నది. కొద్ది సంవత్సరాల నుంచి చూస్తే... జిల్లాలో సన్న వడ్లు పండించే రైతులు తమ ధాన్యాన్ని ఏనాడూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించిన దాఖలాలు లేవు. సన్న బియ్యానికి డిమాండ్ ఎక్కువ ఉంటుండడంతో ధాన్యానికి కూడా ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే అధికంగానే పలుకుతున్నది. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కింటాకు రూ.2,320 ఉండగా, గత సీజన్‌లో సన్నాలను కోసి పచ్చి వడ్లను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువెళ్లినా, మిల్లుల్లో విక్రయించుకున్నా వ్యాపారులు కింటాకు రూ.2,500 నుంచి 3,200 వరకు ధర పెట్టారు. అందుకే సన్న వడ్లను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు. గతంలో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోనే సన్న రకాలను ఎక్కువ పండించగా.. పచ్చి వడ్లకు సైతం ధర అధిక ధర వస్తుండడంతో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోనూ సన్నాల సాగు విపరీతంగా పెరిగింది. నేడు జిల్లాలో 4,72,000 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఇందులో 3,79,000 ఎకరాల్లో సన్న రకాలే వేశారు. దొడ్డు రకం సాగు 93 వేల ఎకరాల్లో మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

### ఎక్కడ అమ్ముకున్నా బోనస్ ఇవ్వాలి



ఐకేపీ కేంద్రాలకు తీసుకువెళ్లిన సన్నరకం ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామనడం సరికాదు. సాగర్ కాల్వ కింద వ్యవసాయం చేసి సన్న ధాన్యం పండించే రైతులందరూ కూడా కోత మిషన్లతోనే పొలం కోయిస్తారు. పచ్చి వడ్లనే నేరుగా ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తారు. ప్రభుత్వం పెట్టిన మద్దతు ధరకు కంటే కూడా బాగానే ధర దక్కుతుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకుంటే వడ్లు ఆరబెట్టాల్సి ఉంటుంది. దాంతో తూకం తగ్గుతుంది. అలాంటప్పుడు రైతులకు ఏంటి ప్రయోజనం. రైస్ మిల్లుల రైతులు విక్రయించే ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

**-చామకూరి అంజి, రైతు, పొనుగోడు గ్రామం, గరిడేపల్లి మండలం**

### మిల్లుల వద్ద ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం

ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా రూ.500 బోనస్ ఇచ్చేందుకు సన్నాల కోసం కొనుగోలుకు ప్రత్యేకంగా కేంద్రాలను సిద్ధం చేస్తున్నది. దాంతో రైతులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. కేవలం మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు, లేదా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే బోనస్ దక్కుతుంది. కొద్ది సంవత్సరాలుగా పరిశీలిస్తే సన్నాలకు బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర కంటే దాదాపు రూ.500 నుంచి 800 వరకు ఎక్కువ పలుకుతున్నది. అంతేగాక కోత మిషన్లతో పొలంలోనే బోరేల్లో నింపి తీసుకువెళ్తుండగా, ధాన్యంలో తేమ శాతం దాదాపు 25 నుంచి 30 వరకు ఉంటున్నది. ఒకవేళ వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లినా తేమ శాతం 14 వచ్చే వరకు ఆరబెట్టాల్సి ఉంటుంది. ఇలా ఆరబెట్టడం ద్వారా కింటాకు 7 కిలోల వరకు తగ్గుతుంది. అలా రైతులు కింటాకు రూ.250 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఐదారు రోజుల సమయం కూడా పడుతుంది. ఇంతా చేస్తే రైతుకు అక్కడ ఇచ్చేది కింటా మద్దతు ధర 2,320 రూపాయలే. ఆరబెట్టిన నష్టం పోనూ 2,070 దక్కుతుండగా, ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపితే రూ.2,570 దక్కుతుంది. అలా కాకుండా ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ మిల్లుల వద్ద కూడా ఇస్తే తరుగు ఉండకపోగా క్వింటాకు రూ.2,800 వరకు ధర పలుకుతుండగా, బోనస్ 500 కలుపుకొని రైతుకు మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మిల్లుల వద్ద విక్రయించిన ధాన్యానికి అక్కడి ప్రభుత్వం రైతుల అకౌంట్లలో బోనస్ వేస్తున్నది. సన్నవడ్లు పండించే రైతులు దాదాపు 99శాతం మంది మిల్లులకే విక్రయిస్తుండగా అక్కడే కొనుగోలు వ్యవస్థను ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ వద్ద ప్రతి రైతుకు సంబంధించి బ్యాంకు అకౌంట్లు, క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో రైతుకు ఉన్న భూమి, ఎన్ని ఎకరాల్లో ఎలాంటి పంట వేశారు అనేది రికార్డు ఉన్నందున బోనస్ రూ.500 మిల్లుల వద్ద కూడా ఇస్తే ఎలాంటి అవకతవకలకు కూడా తావు ఉండదని అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది. నిజంగా రైతాంగానికి బోనస్ ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే మిల్లుల వద్ద విక్రయించుకున్నా ఇవ్వాలని అన్నదాతలు అంటున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

## మూసీ పునర్నిర్మాణానికి అన్ని వర్గాలు మద్దతు తెలపాలి

- మల్లన్నసాగర్ నుంచి 2 టీఎంసీల నీటిని మూసీలోకి తెస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, అక్టోబర్ 4 : నిజాం కాలంలో నిర్మించిన మూసీ పునర్నిర్మాణానికి అన్ని వర్గాలు మద్దతు తెలుపాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మూసీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. శుక్రవారం మట్టపల్లి వద్ద విలేకరులతో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జీవధారగా ఉన్న మూసీనదిని దశాబ్దాలుగా ప్రక్షాళన చేయక కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న పనిని అందరూ స్వాగతించాలన్నారు. ప్రక్షాళన తరువాత మల్లన్నసాగర్ నుంచి 2 టీఎంసీల నీటిని తీసుకొని గండిపేటకు, అక్కడి నుంచి మూసీ నదిలోకి తీసుకువస్తామన్నారు.

వ్యవసాయానికే గాక తాగేందుకు పనికి వచ్చేలా మూసీ నీటిని అందిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూక్యా మంజూనాయక్, రామిశెట్టి అప్పారావు, వంటిపులి శ్రీనివాస్, సుబ్బారావు, దేశ్‌ముఖ్, న్యాయవాదులు సాముల రాంరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాసరావు, చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, వంగవీటి రామారావు ఉన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి ఇటీవల మరణించగా, ఆయన అస్తికలను కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కృష్ణానదిలో కలిపారు.

## ప్రతి ఇంటినీ కవర్ చేయాలి

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నీలగిరి, అక్టోబర్ 4 : కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో ముందుగా నిర్ణయించిన ప్రతి ఇంటినీ కవర్ చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి, హ్యాపీ హోమ్స్‌లో సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం వరకు చేసి సర్వే వివరాలను తెలుసుకున్నారు. బేస్ డేటా ఆధారంగా సర్వే నిర్వహించాలని, ఏ ఇంటినీ వదిలి పెట్టకూడదని సూచించారు. ఏ రోజు డేటాను ఆ రోజు నమోదు చేయాలని ఆదేశించారు. ఫొటోలు తారుమారు కాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. సర్వేలో నల్లగొండ ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి ఉన్నారు.



కేశరాజుపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

## రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

- 48 గంటల్లో ఖాతాల్లో నగదు జమ
- సన్న వడ్లకు రూ.500 బోనస్
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

సూర్యాపేట, అక్టోబర్ 4 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర, బోనస్‌ను పొందాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి వానకాలం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటలలో నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్న రకం కొనుగోలు కేంద్రంలో వడ్లు అమ్మిన వారికి మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ అందుతుందని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 4,72,934 ఎకరాల్లో వరి సాగు చేయగా.. 3,79,746 ఎకరాల్లో సన్న వడ్లు, 93,188 ఎకరాల్లో దొడ్డు రకం పండించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 206 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, అవసరమైతే మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 63, ఐకేపీ 129, మెప్మా 13 కేంద్రాలు ఉంటాయని చెప్పారు. మండల కమిటీలు నిర్ణయించిన చోట సన్న రకం, దొడ్డు రకం కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 15 నాటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. వడ్ల రకం పరిశీలనలో ఏమైనా అనుమానం ఉంటే పొట్టు తీసి మైక్రో మీటర్ ద్వారా పొడవు, వెడల్పు నిష్పత్తి 3 కన్నా తక్కువ ఉంటే దొడ్డు రకానికి చెందినవిగా, 3 కన్నా ఎక్కువ వస్తే సన్న రకానికి చెందినవని నిర్ణయించాలన్నారు. సన్న రకం బస్తాలకు ఎరువు రంగులో ఎస్, దొడ్డు రకం సంచులకు ఆకుపచ్చ రంగులో డీ అని గుర్తు పెట్టాలన్నారు. ప్రతి గన్నీ బ్యాగ్‌పై కొనుగోలు కేంద్రానికి సంబంధించిన వివరాలు ఉండాలని సూచించారు. డ్యామేజ్ ఉంటే తిరిగి జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. పంట పచ్చిగా ఉన్నప్పుడు వరి కోయడం వల్ల వడ్లు తాలుగా మారుతాయని, హార్వెస్టర్ల యజమానులతో మండల స్థాయి కమిటీలు సమావేశాలు నిర్వహించి ఎండిన తరువాత కోసేలా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం తేమ శాతం 14 ఉంటేనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, అప్పుడే సన్న రకానికి రూ.500 బోనస్ వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్డీఓ అప్పారావు, డీఎస్ఓ రాజేశ్వరరావు, సివిల్ సప్లయ్ డీఎం టీఎస్ఎస్ ప్రసాద్, డీఓ శ్రీధర్‌రెడ్డి, డీసీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చెప్పిండని... తిరుమలగిరి ఎస్ఐ కొట్టిండు!

## మెడకు ఉరితాడుతో యువకుడి సెల్ఫీ వీడియో

- ఆత్మాహత్యాయత్నంతో పరిస్థితి విషమం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- డీజిల్ దొంగతనం చేశాడంటూ క్రషర్ ఓనర్ ఫిర్యాదు
- సెల్ఫీ వీడియోలో తనకు ఏ పాపమూ తెలువదన్న నాగరాజు
- శాలిగౌరారం మండలం ఆకారంలో ఘటన

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్4(నమస్తే తెలంగాణ)/ శాలిగౌరారం/ తిరుమలగిరి/ తుంగుతుర్తి : తనకు సంబంధం లేకున్నా డీజిల్ దొంగతనం పేరుతో ఎస్ఐ తీవ్రంగా కొట్టాడన్న ఆవేదనతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారంలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జరిగింది. తనకు రావాల్సిన జీతం అడిగినందుకు స్టోన్ క్రషర్ యజమాని ప్రోద్బలంతో ఎమ్మెల్యే.. ఎస్ఐకి చెప్పాడని, ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించి ఇష్టం వచ్చినట్లు కొట్టాడంటూ బాధిత యువకుడు నాగరాజు ఊరి తాడు బిగించుకుని సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. 'నాకు ఏ పాపమూ తెల్వదు. ఎన్నడన్న స్టేషన్‌కు పోయినోడిని కాదు. ఎవ్వని జోలికి కూడా పోయినోడిని కాదు. నన్ను ఇరికించారు' అంటూ వీడియోలో కన్నీటి పర్యంతం అయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాల మేరకు... శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన శనిగ నాగరాజు సూర్యాపేట జిల్లా తొండ గ్రామంలోని గొలుసుల వెంకన్న నిర్వహణలో ఉన్న బాలాజీ స్టోన్ క్రషర్ మిల్లులో ఆరు నెలల నుంచి టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యజమాని వద్దన డంతో అక్కడ పని మానేశాడు. ఈ క్రమంలో రెండు నెలల జీతం రావాల్సి ఉందని నాగరాజు కొద్దిరోజుల కిందట యజమానికి ఫోన్ చేశాడు. యజమాని జీతం ఇవ్వకపోగా తన కంపెనీలో డీజిల్ దొంగతనం జరిగిందంటూ నాగరాజుతోపాటు మరికొందరిపై తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకన్న స్థానిక ఎమ్మెల్యేను సైతం ఆశ్రయించి ఎస్ఐకి ఫోన్ చేయించినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తిరుమలగిరి ఎస్ఐ వంటెపాక సురేశ్ నాలుగైదు రోజులుగా నాగరాజుకు ఫోన్ చేస్తూ స్టేషన్‌కు రమ్మంటున్నాడు. తనకు సంబంధం లేదని నాగరాజు వెళ్లకపోయే సరికి బుధవారం సాయంత్రం ఎస్ఐ ఫోన్ చేసి తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. గురువారం ఉదయం నాగరాజు తన బావమరిదితోపాటు తమ్ముడిని వెంట పెట్టుకుని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడికి వెళ్లాక ఎస్ఐ విచారణ పేరుతో నాగరాజుతోపాటు అతడి తమ్ముడిని తీవ్రంగా చితకబాది మళ్లీ ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని ఆదేశించి సాయంత్రం వదిలిపెట్టాడు. తనకు ఏ సంబంధమూ లేని కేసులో ఇరికించి ఇష్టమొచ్చినట్లు చితకబాదడంతో నాగరాజు తీవ్ర మనస్థాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు

రాత్రంతా ఆవేదనతో ఉన్న నాగరాజు శుక్రవారం ఉదయం ఆకారంలోని తన వ్యవసాయ భూమిలో చింత చెట్టుకు తాడు వేసి మెడకు బిగించుకుని సెల్ఫీ వీడియోలో మాట్లాడాడు. అనంతరం ఉరి వేసుకున్నాడు. అటు నుంచి వెళ్తున్న కొందరు గమనించి నాగరాజును కిందకు దించి స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు అక్కడి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నాగరాజుకు భార్య, ఒక కూతురు ఉన్నట్లు ఆయన బంధువులు తెలిపారు.

### నన్ను ఇరికించిండ్రు...

నాగరాజు సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ.. 'తమ్ముడూ సాయి. నేను లేకున్నా నన్ను ఇందులో ఇరికించిండ్రు. ఎస్ఐ అయితే ఇష్టం వచ్చినట్లు కొట్టిండు. గోసుల వెంకన్న చెప్తే ఎమ్మెల్యే చెప్పిండని ఎస్ఐ కొట్టిండు. నా ఇళ్లు ముంచిండు గొలుసుల వెంకన్న. గిరిగాడూ చేసిండు. ఎస్ఐ సురేశ్, కృష్ణ, కాంత్రి చేసిండ్రు. వీడు పిరికోడు సచ్చిపోయిండు అని అందరూ అనుకోవచ్చు. నేను ఎన్నడన్న స్టేషన్‌కు పోయినోడిని కాదు. ఎవ్వని జోలికి పోయినోడిని కాదు. నన్ను ఇరికించిండ్రు. వీరస్వామి కలుస్తరా. సాయి కలుస్తరా తమ్ముడూ... నేను మళ్లీ పుడితే కలుస్త' అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యాడు.

### నాగరాజు ఆత్మహత్యాయత్నంతో నాకు సంబంధం లేదు

- ఎమ్మెల్యే సామేల్

ఆకారం గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ నాగరాజు ఆత్మాహత్యాయత్నానికి, తనకు సంబంధం లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్న నాగరాజు, కొంతమంది కార్మికులకు యాజమాని గొలుసుల వెంకన్న వేతనాలు ఇవ్వకుండా వారిపై డీజిల్ దొంగతనం కేసు పెట్టాడని కాంగ్రెస్ నాయకులు తనకు ఫోన్ చేస్తే తానే ఎస్ఐకి ఫోన్ చేసి ఇరువురు బయటి మాట్లాడుకుంటారు, వదిలి పెట్టండని చెప్పానన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పోలీస్ కేసులు పెట్టి ఇబ్బందులు పడుతున్న గొలుసుల వెంకన్నను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

### నాగరాజును కొట్టలేదు

తన క్రషర్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్న నాగరాజు డీజిల్ దొంగతనం చేస్తున్నాడని మిల్లు యజమాని గొలుసు వెంకన్న స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో నాగరాజును పిలిపించి అడిగాము. తాను దొంగతం చేసింది వాస్తమని నాగరాజు ఒప్పుకొన్నాడు. తాము ఇరువురం మాట్లాడుకుంటామని చెప్పి పేపర్ కూడా రాసిచ్చాడు. ఇప్పుడు ఎస్ఐ కొట్టిన దెబ్బలకు మనస్థాపం చెందానని, ఎమ్మెల్యే కొట్టమంటేనే కొట్టాడని చెప్పడం అవాస్తవం. నాగరాజును నేను కొట్టలేదు. వేధించలేదు. ఎమ్మెల్యే మాకేమీ చెప్పలేదు.

**- సురేశ్, తిరుమలగిరి ఎస్ఐ**

## అంబుజా సిమెంట్ ప్లాంట్‌లో ఉత్పత్తి బంద్

పాలకవీడు, అక్టోబర్ 4 : దామరచర్ల మండలం గణేశ్ పహాడ్ గ్రామ పరిధిలో గల అంబుజా సిమెంట్ పరిశ్రమలో ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేయడంతో దట్టమైన పొగలు రావడం ఆగాయి. కొన్ని రోజులుగా సిమెంట్ పరిశ్రమ నుంచి వస్తున్న పొగ వల్ల పాలకవీడు మండలంలోని శూన్యపహాడ్, కల్మటితండా, జాన్‌పహాడ్ గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పొల్యూషన్ అధికారులు అంబుజా సిమెంట్ పరిశ్రమలో తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. కాలుష్య ఉద్గారాలు విడుదల కాకుండా చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు తాత్కాలికంగా ఉత్పత్తిని నిలిపివేయాలని యాజమాన్యాన్ని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం నుంచి ఉత్పత్తి నిలిపి వేయడంతో పరిశ్రమ నుంచి పొగ రావడం తగ్గిందని గ్రామస్తులు తెలిపారు.

అయితే పూర్తి స్థాయిలో కాలుష్యం రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.